క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సన్మానించిన విశ్వాసులు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల చర్చి వద్ద ఆదివారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను సంఘ విశ్వాసులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. పాస్టర్ జ్యోతిబాబు, విశ్వాసులు పలివెల శ్రీను తదితరుల ఆహ్వానం మేరకు గ్రామానికి ఇజ్రాయిల్ వచ్చారు. ఈ సందర్భంగా చర్చిలో ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు పిల్లి దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ పెంకే గోవిందరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు చిట్టూరి చిన్ని, కనకాల రాము, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధనమ్మ మర్రి వద్ద భక్తుల సందడి

కపిలేశ్వరపురం: ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా పేరొందిన కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మమర్రికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం సెలవు దినం కావడం, విద్యార్థులకు పరీక్షలు పూర్తయిన కారణంగా మర్రి ప్రాంతం పర్యాటకులతో కిక్కిరిసింది. కొత్తపేట, మండపేట, రావులపాలెం, అమలాపురం తదితర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గోదావరి తీర ప్రాంతం, పచ్చటి పొలాల ఆవరణల్లో సందడి చేశారు. అంగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా బసవేశ్వరస్వామి ఊరేగింపు



అంగరలో బసవేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: బసవేశ్వర స్వామి జన్మదిన ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అంగరలో కర్దభక్తుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. చేనేత వృత్తిదారులు ఆరాధ్య దైవంగా కొలిచే బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ సమాజంలో కుల, వర్ణ వ్యవస్థలను రూపు మాపేందుకు విశేష కృషి చేసిన బసవేశ్వరుడు సమాజ హితం కోరేవారందరికీ ఆదర్శమన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం ద్రాక్షారామ పాఠశాల, కళాశాల ప్రాంగణంలో ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ కేంద్రాన్ని రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం, ఎస్సీ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ పరిశీలించారు. 5వ తరగతిలో ప్రవేశానికి గాను 129 మందికి 78 మంది, ఇంటర్‌లో ప్రవేశ పరీక్షకు 120 మందికి 103 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ వై.లక్ష్మణకుమార్ తెలిపారు.

పామర్రులో చోరీ

కె.గంగవరం: పామర్రు శివారు శ్రీరామ్‌నగర్‌లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనుసూరి సీతమ్మ తన ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.30 వేల నగదు, సుమారు రూ.90 వేల విలువైన బంగారాన్ని దొంగిలించారు. ఇటీవల కూళ్ల గోదావరిలో స్నానానికి దిగి అనుసూరి సాయిరామ్ మృతి చెందిన సంగతి తెలిసిందే. సాయిరామ్‌కు అమ్మమ్మ అయిన సీతమ్మ వారం రోజులుగా దిన కార్యక్రమాల సందర్భంగా వేళంగిలో ఉంటోంది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఇంటికి వచ్చిన సీతమ్మ చోరీ జరిగిందని గుర్తించి ఆమె కుమారుడి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరించింది.

‘స్పందన’కు అధికారులు హాజరు కావాలి

రామచంద్రపురం: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు డివిజన్ స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆర్డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందనలో మండల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

వసంత్‌కుమార్‌కు నివాళి

కపిలేశ్వరపురం: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకుడు, కోనసీమ ప్రాంత ఉద్యమ సీనియర్ నాయకుడు వసంత్‌కుమార్ మృతికి కపిలేశ్వరపురం మండలం సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. అంగరలోని తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం వసంత్‌కుమార్ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కోనసీమలోని పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనార్థం చేపట్టిన ఉద్యమాల్లో వసంత్‌కుమార్ కీలకంగా వ్యవహరించారని సీపీఎం సీనియర్ నాయకులు జుత్తుక చిన వీర్రాజు అన్నారు.

చివరిలో కన్నీళ్లు

- ఆందోళన చెందుతున్న రైతులు
- ఈదురుగాలులతో నేలకూలిన చెట్లు
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం



మండపేటలో నేలకొరిగిన వరిపంట

మండపేట: అకాల వర్షం అన్నదాతలను కలవరపెట్టింది. ఆదివారం తెల్లవారుజామున దాదాపు గంటన్నర పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కళ్లాల్లోని ధాన్యం రాసుల వద్దకు నీరు చేరింది. ఈదురుగాలుల ప్రభావంతో పలుచోట్ల పంట నేలకొరిగింది. చెట్లు విరిగిపడి విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండపేట నియోజకవర్గంలో 45,000 ఎకరాల్లో రబీ సాగు చేయగా ప్రస్తుతం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 35 శాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు ధాన్యాన్ని రైతులు తమ పొలాల్లోను, కళ్లాల వద్ద, రోడ్ల పక్కన ఆరబెట్టుకుంటున్నారు. అకాల వర్షంతో రాసుల చుట్టూ నీరు చేరింది. దాంతో రైతులు నష్ట నివారణ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండపేట ఎంపీడీఓ ఐ.రాజు, ఏవో కె. ఏసుబాబు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక మారేడుబాక రోడ్డులో చెట్టు విరిగిపడి తెల్లవారుజాము నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గిన వెంటనే ట్రాన్స్‌కో ఏడీఏ తిరుమలరావు నేతృత్వంలో సిబ్బంది పని చేసి ఉదయం 10 గంటల సమయానికి సరఫరాను పునరుద్ధరించారు.

రాయవరంలో భారీ వర్షం

రాయవరం: అకాల వర్షం రైతన్నకు నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది.పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. ఇప్పటికే వరి నూర్పిళ్లు చేపట్టి రహదారులపైన, కళ్లాల్లోనూ ఆరబెట్టిన ధాన్యం తడిసింది. చాలావరకూ రైతులు ధాన్యపు రాసులపై బరకాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. ఈదురు గాలులకు బరకాలు ఎగిరిపోవడంతో పలుచోట్ల వర్షపు నీరు లోనికి వెళ్లి ధాన్యం తడిసింది. ఉదయం 10 గంటలకు వర్షం నిలిచిపోవడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు.కాగా కొద్ది రోజులుగా ఎండలు మండి పోవడంతో ఇటుకల బట్టీ యజమానులు జోరుగా పచ్చి ఇటుకను తీసి కళ్లాల్లో ఆరబెట్టారు. ఊహించిన విధంగా వచ్చిన వర్షప్రభావానికి పచ్చి ఇటుకలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దీంతో బట్టీల యజమానులు కూడా ఇబ్బందులు పడ్డారు. మండుటెండలతో కొద్ది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు అకాల వర్షంతో కొంత ఉపశమనాన్ని పొందారు. మండలంలో 15.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి

రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వీలైనంత వరకూ వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబుతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఆదివారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఒకవేళ వరికోతలు కోయాల్సి వస్తే కంబైన్డ్ హార్వెస్టర్ యంత్రాలు ఉపయోగించి, వెంటనే ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి టార్పాలిన్లతో కప్పాలన్నారు. కూలీలతో వరి కోతలు కోయించరాదన్నారు. తడిసిన ధాన్యం మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని తడిచిన వరి కంకులపై లేదా ధాన్యంపై పిచికారి చేయాలన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

కాజులూరు: కాజులూరు మండలంలో ఆదివారం ఉదయం ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు విడవకుండా వర్షం పడటంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. వైర్లు తెగిపోవటంతో రాకపోకలు స్తంభించాయి. కొన్నిచోట్ల గింజ గట్టిపడి పక్వానికి వచ్చిన వరి పొలాలు నేలకొరిగాయి. మరోపక్క పిందెలు, నిండైన కాయలతో ఉన్న మామిడి చెట్లకు వర్షం కారణంగా తీవ్ర నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. ఈదురు గాలులకు పక్వానికి రాకుండానే మామిడి కాయలు రాలిపోయాయని అంటున్నారు. పంచాయతీ అధికారులు రహదారులపై పడిన చెట్ల కొమ్మలను తొలగించగా, ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ స్తంభాలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.



గొల్లపాలెంలో నేలరాలిన మామిడి కాయలు



రాయవరంలో కురుస్తున్న వర్షం



రాయవరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్



కాజులూరు చాకిరేవుమెరకలో తెగిపడిన విద్యుత్ తీగలు

ఫ్యామిలీ డాక్టర్ మండల షెడ్యూల్

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ఫ్యామిలీ డాక్టర్ నిర్వహిస్తున్నాయి. ఆయా పీహెచ్‌సీల వైద్యులు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంక, పి.చంద్రమౌళి, సీహెచ్ రాకేష్ చౌదరి, కె.శివరంజిని, కరుణేంద్రకుమారి గ్రామాలకు వెళ్లి సేవలందిస్తున్నారు. వారి వైద్య సేవల షెడ్యూలు ఇలా ఉంది. పడమర ఖండ్రికలో 1వ, 3వ సోమవారాలు, కపిలేశ్వరపురం 01 సచివాలయంలో 1వ, 3వ మంగళవారం, అంగర 2 సచివాలయంలో 1వ, 3వ బుధవారాలు, తాతపూడిలో 1వ, 3వ గురువారాలు, కపిలేశ్వరపురం- 2 సచివాలయంలో 1వ 3వ శుక్రవారాల్లో అంగర పీహెచ్‌సీ వైద్యులు వైద్య సేవలు అందిస్తారు. కోరుమిల్లి 01లో 1, 3వ శనివారాలు, టేకి 01లో 2వ, 4వ సోమవారాలు, కోరుమిల్లి 2లో 2వ, 4వ మంగళవారాలు, మాచరలో 2వ, 4వ బుధవారాలు, టేకి2లో 2వ, 4వ గురువారాల్లో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు సేవలు అందిస్తారు. వడ్లమూరులో 2వ, 4వ శుక్రవారాలు, నేలటూరులో 2వ, 4వ శనివారాలు, వల్లూరులో 1వ సోమవారం, 3వ మగళవారం, వెదురుమూడిలో 1వ మంగళవారం, 3వ బుధవారం, నల్లూరులో 1వ బుధవారం, 3వ గురువారం, కాలేరులో 1వ గురువారం, 3వ శుక్రవారం అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యులు రోగులకు సేవలు అందిస్తారు.

దివ్యాంగుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలి

మండపేట: కేంద్ర ప్రభుత్వం 2016లో ఆమోదించిన దివ్యాంగుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు ధూళి జయరాజు కోరారు. స్థానిక దివ్యాంగుల భవనంలో దివ్యాంగుల సంఘం పట్టణశాఖ అధ్యక్షుడు నురుకుర్తి లోవరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి జయరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ సంక్షేమ రంగాల్లో దివ్యాంగులకు రావాల్సిన వాటాను కల్పించాలన్నారు. షేక్ నబీ, అంబటి రాంబాబు, రామకృష్ణ, విజయ్, గాలింకి నాగేశ్వరరావు, డి రాజబాబు, మోరంపూడి సూరిబాబు, పువ్వల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

‘మానవత’ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు



లొల్లలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరం

రాయవరం: విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లొల్ల గ్రామంలో ఆరోగ్య వైద్యం, యోగా థెరపీ, హోమియోపతి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో అక్షయ తృతీయ, శంకరాచార్య జయంతిని పురస్కరించుకుని ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో రాయవరం చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పరిపూర్ణ విద్య, ఉన్నత వ్యక్తిత్వ లక్ష్యంతో విశ్వమానవత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కార విద్య గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసచౌదరి సేవలను వారు ప్రశంసించారు. అనంతరం వైద్య ఆరోగ్య శిబిరాన్ని, యోగా థెరపీని ప్రారంభించారు. లొల్ల పరిసర గ్రామాలకు చెందిన 100 మంది వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. అలాగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే కోచింగ్‌ను కూడా ప్రారంభించారు. హోమియో వైద్యులు వీరాంజనేయులు, సత్యనారాయణ, మానవతా వలంటీర్లు సుజాత, వినీత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. ఆదివారం అముజూరులో తాగునీటి సరఫరా నిమిత్తం పైప్ లైన్ ఏర్పాటు పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకూ గ్రామానికి చెరువు నీరు మాత్రమే ప్రభుత్వ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. సర్పంచ్ నానాపరపు కళ్యాణి వినతి మేరకు సుమారు రూ. 3 లక్షల మండల పరిషత్ నిధులతో బోర్ వేసి పైప్‌లైన్ నిర్మించడానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే రవిచంద్ర, నానాపరపు శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీను, గెద్దాడ సతీష్, వాసంశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఏడిదలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మండపేట: మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982–87 మధ్యకాలంలో (6వ తరగతి నుంచి 10వ తరగతి) చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పాఠశాలకు చేరుకుని సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ పాఠశాలలో తాము చేసిన సందడికి సంబంధించి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పూర్వపు విద్యార్థులు యడవిల్లి మురళీధర్, అనుకుల నగేష్ కుమార్, బేతా దుర్గారావు, తాళ్లూరి ఆదినారాయణ, దొంతుకుర్తి శ్రీనివాస్, గణేశుల వీరబాబు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా అష్టోత్తర కలశ పూజ



సామూహిక శతకలశ పూజలో మహిళలు

మామిడికుదురు: లూటుకుర్రు బోణం మెరకలో కొలువు దీరిన గ్రామ దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ఆదివారం అష్టోత్తర శత కలశ పూజ ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ పూజా కార్యక్రమం ఆద్యంతం కనుల పండువగా జరిగింది. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వివిధ పుష్ప, ఫలార్చనలు ఘనంగా జరిపించారు. పలు రకాల మిఠాయిలు, వంటకాలతో మహా నివేదన సమర్పించారు. పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో శ్రీగణపతి, మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పలు రకాల బెంగళూరు పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సంక్షేమ పాలనకు ప్రజల నుంచి ఆదరణ



మాచరలో ఇంటింటి పర్యటనలో వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పాలనపై మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదరణ లభిస్తోందని మాచర పంచాయతీ సర్పంచ్ వాసంశెట్టి సునీత, పీఏసీఎస్ చైర్మన్ కరెడ్ల చంటి అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయుడు జగపతి, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం నుంచి పేదలకు అందిన లబ్ధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రజల సమ్మతిపై ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను అతికించారు.

విచారణ వేగవంతం చేయాలి



ఆర్యావటంలో మహేష్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

కాజులూరు: గొల్లపాలెంలో బయో డీజిల్ ట్యాంకుల్లో పడి ఆర్యావటం గ్రామానికి చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25) మృతి చెందడంపై పోలీసుల విచారణ వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సూచించారు. ఆదివారం ఆర్యావటం, శీల గ్రామాల్లో మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికందివచ్చిన కొడుకులు అర్ధాంతరంగా మృతి చెందటంతో వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మృతదేహాలపై గాయాలు ఉన్నందున హత్య జరిగినట్టు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారని, ఆ విధంగా పోలీసులు విచారణ చేయాలన్నారు.

దుకాణాల బంద్

పి.గన్నవరం: స్థానిక కిరాణా వ్యాపారి తమ్మన నారాయణమూర్తి ఆకస్మిక మృతికి సంతాపంగా ఆదివారం ఉదయం గ్రామంలో దుకాణాలను మూసివేశారు. ఆయన మృతికి వర్తక సంఘ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

చిన్నారి వైద్యానికి చేయూత

అంబాజీపేట: ఓ చిన్నారికి నీడ్స్ ఫౌండేషన్ చేయూత అందించింది. స్థానిక కొర్లపాటివారి పాలేనికి చెందిన పెంటా హాసీల (5) ఊపిరితిత్తులలో నీరు పట్టడం వల్ల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు అవుతుందని స్థానిక గణపతి హోటల్‌కు చెందిన నంద గణపతి తన స్నేహితుడు చీకట్ల కిరణ్ కుమార్ ద్వారా నీడ్ ఫౌండేషన్‌కు తెలిపారు. దాంతో ఆ ఫౌండేషన్ నుంచి రూ.15 వేలను ఆదివారం అందించారు. ఫౌండేషన్ సభ్యులు కిలపర్తి చైతన్య, సూర్య అప్పారి, వెంకటేష్ చిటికెన, కంచిపల్లి లింగేశ్వరరావు, చీకట్ల కిరణ్‌కుమార్, ఆర్‌కే నాయుడు ఆకుల పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయండి

రైతులకు ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం సూచన



కుందూరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రబీలో వరి కోతలు నిలుపుదల చేయాలని రైతులకు రామచంద్రపురం ఆర్డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆదివారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలసి మండలంలోని ఉట్రుమిల్లి, కె.గంగవరం మండలం కుందూరు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం రాశులను రైతులు మెరక ప్రాంతాలకు తరలించి బరకాల సాయంతో భద్రపరచుకోవాలని అన్నారు. వర్షాలకు ధాన్యం తడిస్తే వెంటనే ఆరబెట్టుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన బరకాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. తడిచిన ధాన్యంతో సహా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. తహసీల్దార్లు పి.తేజేశ్వరరావు, టి.వైద్యనాథ్ శర్మ, వ్యవసాయ అధికారులు రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కుందూరు, పామర్రు గ్రామాల్లో ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం పర్యటించారు. ఆయా గ్రామాల్లో తడిసిన పంట పొలాలను పరిశీలించి అధైర్య పడొద్దని రైతులకు భరోసా ఇచ్చారు. తడిచిన ధాన్యాన్ని కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకుంటామని చెప్పారు. ఆ ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టాలని సూచించారు. తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో ఇబ్బందులు



చేదువాడలో కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కాజులూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. మోదీని గద్దెదించి దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో సీపీఎం నిర్వహిస్తున్న ప్రచారభేరీ కాజులూరు, చేదువాడ, శీల, ఒంటితాడి, శీలలంక, తిప్పరాజుపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం సాగింది. ఆ పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు, గోడప్రతులు ప్రజలకు పంచారు. చేదువాడలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు అధ్యక్షతన జరిగిన సభలో రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సీపీఎం నాయకులు బుడితి ప్రభాకరరావు, జక్కి శ్రీనివాసరావు, దంగేటి శ్రీనివాస్, షేక్ మీరా, కూరాటి ప్రసాద్, దడాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు

ఆత్రేయపురం: అకాల వర్షంతో తడిచిన ధాన్యం విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని ధాన్యం కొనుగోలు సిబ్బందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం లొల్ల, ఆత్రేయపురం గ్రామాల్లో వర్షానికి తడిచిన ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి ఆదుకోవాలని, నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మిల్లర్లు ఆన్‌లైన్ కావడం లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఆయన స్పందించి కళ్లంలో పట్టి ఉన్న ధాన్యం తరలించాలని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సూచించారు. అలాగే వాహనాలు, ఆన్‌లైన్ టార్గెట్‌లో ఇబ్బందులు గమనించి వాటిని పరిష్కరించారు. తడిచిన ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణం అంటే 5 కిలోల ఉప్పును పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి ఆరబెడితే మొలక రాకుండా, రంగు మారకుండా ఉంటుందన్నారు. ఏఓ పట్టాభిరామయ్య మాట్లాడుతూ మండలంలో సుమారు 1,500 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే 83310 56542ను సంప్రదించాలని అన్నారు. వీఏ మణికంఠ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఎనలేనివి



భక్తవత్సలనాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వీఆర్వోలు

రామచంద్రపురం రూరల్: వీఆర్వోల సంఘానికి సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భక్తవత్సలనాయుడు అందించిన సేవలు ఎనలేనివని సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ అన్నారు. దివంగత భక్తవత్సలనాయుడు ద్వితీయ వర్ధంతిని రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ చీలికలుగా ఉన్న వీఆర్వోల సంఘాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సంఘంగా నిర్మించడంలో భక్తవత్సలనాయుడు ముఖ్య పాత్ర పోషించారన్నారు. సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.కృష్ణసాయి, మాజీ కార్యదర్శి పెంకే సత్యనారాయణ, రామచంద్రపురం మండల అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, కోశాధికారి జుత్తుక మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.